క్లుప్తంగా

సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుధా అయ్యంగార్



ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుధా అయ్యంగార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి విధి నిర్వహణలో నిర్లక్ష్యం వంటి ఆరోపణలతో సస్పెండ్ అయ్యారు. ప్రభుత్వాసుపత్రిలో చిన్నపిల్లల వైద్యురాలుగా పనిచేస్తున్న డాక్టర్ సుధా అయ్యంగార్‌ను సూపరింటెండెంట్‌గా వైద్యాధికారులు నియమించారు. ఆమె మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. ఆమెకు ఆర్ఎంవో డాక్టర్ బాలజీకుమార్, ఇతర వైద్యులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి

నందవరం : విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించి వారిలోని నైపుణ్యాలను వెలికి తీయాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ-1 సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కొట్టాల, ఇబ్రహీంపురం గ్రామాల్లోని ఎంపీపీ, జెడ్పీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు.అలాగే మధ్యాహ్న భోజనాని తనిఖీ చేసి, నాణ్యతగా వండాలని ఏజెన్సీ సభ్యులకు సూచించారు. హెచ్ఎం మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థికి చెక్కు అందిస్తున్న నక్కలమిట్ట శ్రీనివాసులు

నందవరం : మండలంలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన పేదింటి విద్యార్థి సునీల్‌కుమార్ నీట్‌లో ర్యాంకు సాధించి ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విషయం తెలిసిందే. శుక్రవారం అదే గ్రామానికి చెందిన నక్కలమిట్ట శ్రీనివాసులు ఆ విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నీట్‌లో ర్యాంకు సాధించిన సునీల్ కుమార్‌కు అండగా ఉంటామన్నారు. ఎంబీబీఎస్ చదవడానికి ఆర్థిక పరిస్థితులు సహకరించక పోవడంతో తన వంతుగా రూ.50 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. 5 సంవత్సరాలకు గానూ ఏడాదికి రూ.10 వేల చొప్పున రూ.50 వేలు అందిస్తామని చెప్పారు. మొదటి విడతగా రూ. 10 వేల చెక్కును అందజేశామని పేర్కొన్నారు. గ్రామస్తులు చాంద్‌బాషా, సుదర్శన్, జోషఫ్ పాల్గొన్నారు.

గోనెగండ్ల హెడ్ కానిస్టేబుల్‌కు ప్రశంస



ఎస్పీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న హెడ్ కానిస్టేబుల్ దేవరాజ్

గోనెగండ్ల: జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన నేర సమీక్షలో ప్రతిభ కనబరచిన పోలీసులకు ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. వీరిలో గురురాఘవేంద్ర పంపు హౌస్ మోటార్స్ దొంగతనం కేసును ఛేదించడంలో ప్రతిభ కనపరచిన గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ దేవరాజ్ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినంది ప్రశంసా పత్రం అందజేశారని సీఐ గంగాధర్ శుక్రవారం తెలిపారు.

డ్యాన్స్, మిమిక్రీలో ప్రతిభ



ప్రశంసా పత్రం, షీల్డ్ అందుకుంటున్న మన్యం శివశంకర్

కోసిగి: జంపాపురం గ్రామానికి చెందిన మన్యం శివ శంకర్ జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో రాణించాడు. డ్యాన్స్, మిమిక్రీలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. డ్యాన్స్ మాస్టర్ శివశంకర్ డ్యాన్స్ గ్రూపులో సోలో డ్యాన్స్, మిమిక్రీలో ప్రథమ స్థానంలో నిలిచాడు. మూడేళ్ల పాటు వరుసగా డ్యాన్స్ గ్రూపు జిల్లా స్థాయి ప్రథమ స్థానం నిలిచినట్లు తెలిపారు. ఒక సారి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు శివశంకర్ తెలిపారు. దీంతో నిర్వాహకులు శివశంకర్‌కు ప్రశంసా పత్రం అందజేశారు.

బాధిత కుటుంబానికి చేయూత

పెద్దకడబూరు: మండల కేంద్రంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు శాంతిరాజు కుటుంబానికి మదర్ థెరిస్సా ఫౌండేషన్ అధినేత బొగ్గుల పరమేష్ శుక్రవారం బొగ్గుల అర్లప్ప చేతుల మీదుగా రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముక్కరన్న, నరసన్న, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు



సర్పంచ్‌లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తన వంద రోజుల పాలనలో లోపాలు బయటపడతాయని తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారనే అపవాదును తెరపైకి తీసుకువచ్చారని చెప్పారు. ఇది మంచి ప్రభుత్వం అని ఇంటింటికీ తిరుగుతున్నారని.. ఏమి చేశారని చెప్పుకుంటున్నారని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలు అమలుకు నోచుకోక తల్లులు, రైతులు, యువత ఆందోళన చెందుతున్నారన్నారు.ఆయన ఆరోపణలను ఖండిస్తూ నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయా ప్రాంతాల్లోని వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో పూజలు జరిపించాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు వేధిస్తున్నారు

మండంలోని వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు, అధికారులు వేధిస్తు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పద్ధతి మార్చుకోకపోతే తాము కూడా ఆలోచించాల్సి వస్తుందని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్పష్టం చేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జగన్ ప్రభుత్వంలో నాయకులు ఎక్కడ తప్పు చేశారో వెతికే పనిలో ఉన్నారని చెప్పారు. మండల పరిషత్ అధికారులు సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లుల ఇవ్వకుండా వేధించటం మంచి పద్ధతి కాదన్నారు. అధికార పార్టీ నాయకులు చెబితేనే బిల్లులు చేస్తామని చెప్పటం ఏమిటని ప్రశ్నించారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా..

నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు రోజూ ఎంపీపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని చెన్నకేశవరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులకు సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎంపీపీ గొల్ల కేశన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



పెద్దకడబూరులో పత్తి రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దకడబూరు : ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి బి.హేమలత, బనవాసి కృషి విజ్ఞానకేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త మౌనిక సూచించారు. పెద్దకడబూరు, హనుమాపురం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో ఖరీఫ్ పంటల్లో ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మిరుప, పత్తి, వరి పంటల్లో ప్రస్తుతం చేపట్టాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులపై క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ సహాయకులు ఇందు, శ్వేత, రాహుల్, కల్యాణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఆదోని సెంట్రల్: పట్టణంలోని అక్షరశ్రీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మేఘనాథ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో బాస్కెట్ బాల్ అండర్-19 విభాగంలో పి.అహ్మద్, కబడ్డీ అండర్-17 విభాగంలో శ్రావణి ప్రతిభ చాటారని తెలిపారు. అలాగే జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో నిత్యారెడ్డి, రుకయ్య, మురళీ, ముజమ్మిల్, యాసిన్, ఫైజాన్, రిహాన్, ఫుట్‌బాల్‌లో చేతనశ్రీ, అమృత, లతికా, చెస్‌లో లలిత్ జతిన్ ప్రతిభ చాటారని తెలిపారు. విద్యార్థులతో పాటు వ్యాయమ ఉపాధ్యాయులు షాషవలీ, మస్తాన్ వలీలను అభినందించారు.

అండర్-15 క్రికెట్ ప్రాబబుల్స్‌కు ఎంపిక

ఆదోని అర్బన్: నెల్లూరు జిల్లాలో జరిగిన అంతర్ జిల్లాల బాలికల అండర్-15 క్రికెట్ పోటీల్లో ఆదోని కిడ్డీస్ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని సంజన మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌కు ఎంపికైంది. ఈ మేరకు శుక్రవారం ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విట్టా రమేష్, సెక్రటరీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ ముజీబ్‌అహ్మద్ విద్యార్థిని, కోచ్ బాలాజీని అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థులు

కౌతాళం: బదినేహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం హరినాథ్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహరాజు తెలిపారు. ఇటీవల కోసిగి జెడ్పీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో అండర్-14 ఖోఖో విభాగంలో రజియా, సబీరా, ఉష మొదటి మూడు స్థానాల్లో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, అండర్-17 ఖోఖో విభాగంలో రేణుక, పవిత్ర, సంగీత, కబడ్డీ అండర్-14విభాగంలో నరసమ్మ, ఇందు, విశాలాక్షి, అండర్-17 విభాగంలో సంగీత జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు వివరించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ పోటీలకు ఎంపిక



జి.స్వాతి

నందవరం :స్థానిక కస్తూర్బా విద్యార్థిని జి. స్వాతి రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. గురువారం కర్నూలులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14 లాంగ్ జంప్‌లో స్వాతి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

గోనెగండ్ల: తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు సూచించారు. శుక్రవారం సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు నేరాలు, క్రమశిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే కష్టపడి చదివి సాధించే ఆలోచన తమ హృదయాల్లో బలంగా ఉండాలన్నారు. భవిష్యత్ ప్రణాళికను ముందే ఎంచుకొని లక్ష్య సాధనకు శ్రమిస్తే సమాజంలో గుర్తింపు తెచ్చుకోవడం అసాధ్యం కాదన్నారు. ఇతరులపై ఆధారపడి ఉండకుండా పోటీతత్వంతో చదివితేనే అనుకున్నది సాధించగలరన్నారు. సెల్‌ఫోన్లు, చెడు అలవాట్లు, ర్యాంగింగ్, మాదక ద్రవ్యాలు లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. హెచ్ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ తాలుకా కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈనెల 30న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం పట్టణంలో ఆవిష్కరించారు.ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేసి కార్మికులను న్యాయం చేయాలన్నారు. ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సురేష్, శ్రీను,జయపాల్, హనుమన్న, నరసింహులు,వీరేష్, గోపాల్, రంగన్న పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో డెంగీ నివారణ



హెచ్. కైరవాడిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కర్

గోనెగండ్ల: పరిసరాల పరిశుభ్రతతో డెంగీ నివారణ సాధ్యమని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ అన్నారు. మండలంలోని హెచ్. కైరవాడి గ్రామంలో ఓ బాలుడికి డెంగ్యూ నిర్ధారణ అయ్యింది. దీంతో గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది శుక్రవారం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని పరిశీలించి, డెంగీ వ్యాధి నమోదైన ప్రాంతంలో పర్యటించి పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యాధి సోకిన బాలునికి ఇచ్చే చికిత్స గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అధిక శాతం వ్యాధులకు దూరంగా ఉంచవచ్చన్నారు. దోమలు వ్యాప్తి చెందే ప్రదేశాలను గుర్తించి లార్వా నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. డాక్టర్ కార్తీక్, ఎంపీహెచ్ ఈఓలు హనుమంతు, భారతి, ఎంపీహెచ్ఎస్ మేరీ, మీనాక్షి పాల్గొన్నారు.

కుష్టు వ్యాధికి మెరుగైన చికిత్స

ఎమ్మిగనూరుటౌన్: కుష్టు వ్యాధికి మెరుగైన చికిత్స ఉందని, అంగవైకల్యం రాకుండా శస్త్ర చికిత్స చేయించుకోవచ్చని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి ఎల్.బాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో డామియన్ ఫౌండేషన్ ఇండియా నెల్లూరు వారి సహాయంతో ఏర్పాటు చేసిన టైలరింగ్, లేడీస్ కార్నర్ షాప్‌ను ప్రారంభించారు.అనంతరం ఫ్రైడే - డ్రైడే కార్యక్రమంలో భాగంగా మురుగు కాలువాలను పరిశీలించారు. జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ మల్లికార్జున రెడ్డి, డీఎఫ్ఐటీ ప్రతినిధి డాక్టర్ సతీష్, ఫిజియోథెరపిస్ట్ రెడ్డి బాబు, డీపీఎంఓలు సుబ్రహ్మణ్యం, సీతారాముడు, ఎంపీహెచ్ఈఓ విజయకృష్ణ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఎమ్మిగనూరుటౌన్: పరిసరాల శుభ్రత ముఖ్యమని, పట్టణ వాసులు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యనివ్వాలని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి సూచించారు. శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి హరికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులకు శనగ విత్తనాలు అందజేయాలి

మంత్రాలయం : మండలంలోని రైతులకు పప్పుశనగ విత్తనాలు అందజేయాలని సీపీఎం తాలుకా ఇన్‌చార్జ్ దేవపుత్ర, మండల కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ జీరా గణేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పంటలు తెగుళ్ల బారిన పడి దెబ్బతిన్నాయన్నారు. దీంతో అధిక శాతం మంది రైతులు పంటలను దున్నేశారన్నారు. ఆయా పొలాల్లో రైతులు శనగ విత్తనాలు సాగుచేసుకునేందుకు సిద్ధమయ్యారని, ప్రభుత్వం వెంటనే విత్తనాలు అందజేసి ఆదుకోవాలని కోరారు.

వ్యాపారులపై చర్యలు తీసుకోండి

పెద్దకడబూరు : మండలంలోనున్న ఎరువుల దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఎరువుల దుకాణదారులు రైతులకు అధిక ధరలకు ఎరువులను అంటకడుతున్నారని మండిపడ్డారు. ఆదోని, ఎమ్మిగనూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లి ఎరువులు తెచ్చుకోవడానికి వీలు పడకపోవడంతో దానిని ఆసరాగా తీసుకొని ధరలు పెంచి విక్రయిస్తున్నారన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.జాఫర్‌పటేల్, మహబూబ్ పాల్గొన్నారు.

ఎల్ఎల్‌సీ ఏఈగా ఈశ్వర్

కౌతాళం: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్ఎల్‌సీ) కౌతాళం మండల ఏఈగా ఈశ్వర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. హోళగుంద ఏఈగా కొనసాగుతూ కౌతాళం మండలానికి ఇన్‌చార్జిగా ఉన్న ఈశ్వర్‌ను రెగ్యులర్ ఏఈగా ఉన్నత అధికారులు నియమించారు.

కడిమెట్లలో స్వచ్ఛతాహీ సేవ

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని కడిమెట్ల గ్రామంలో ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిశుభ్రత, ఆరోగ్యంపై గ్రామస్తులకు వివరించి, వీధుల్లో ర్యాలీ చేపట్టారు. వైస్ ప్రిన్సిపాల్ డా. సుధాకర్, ఎన్ఎస్ఎస్ అధికారి రఘు, విద్యార్థులు పాల్గొన్నారు.

రావి ఆకుపై భగత్‌సింగ్ చిత్రం



ఆదోని రూరల్: భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని అలసందగుత్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థిని జి.హిమవర్షిణి రావి ఆకుపై భగత్‌సింగ్ చిత్రాన్ని రూపొందించి అందరినీ అబ్బురపరిచింది. శుక్రవారం పాఠశాల హెచ్ఎం గిరిజాదేవి విద్యార్థిని అభినందించారు.

వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.5కే భోజనం

- ప్రారంభించిన ఎమ్మెల్యే పార్థసారథి



రైతులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు కేవలం రూ.5కే రుచికరమైన సబ్సిడీ భోజనం అందించే కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ప్రారంభించారు. కాటన్ మర్చంట్ అసోసియేషన్ నాయకులు సోమశేఖర్‌గౌడ్, వెంకటరామిరెడ్డి, లక్ష్మన్నరావు, సుగూరప్ప, యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ముందుగా శ్రీకృష్ణ చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రైతులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు కేవలం రూ.5కే రుచికరమైన భోజనం వడ్డిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్కాన్ సంస్థతో మాట్లాడి నాణ్యతతో కూడిన భోజనాన్ని రైతులకు అందిస్తోందన్నారు.

దసరా పండగకు సీసీఐ కొనుగోలు

వచ్చే నెల దసరా పండగకు రైతులు యార్డుకు తెచ్చిన పత్తి దిగుబడులను సీసీఐ కొనుగోలు చేసేలా ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. రూ.7521 మద్దతు ధరతో రైతులు దిగుబడులను అమ్ముకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వర్ణామృత ప్రాసనం మందుకు విశేష స్పందన



మందును పంపిణీ చేస్తున్న అవోపా, వామ్ సభ్యులు

ఆదోని అర్బన్: పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషన్ అసోసియేషన్ (అవోపా), వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ (వామ్) ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణామృతప్రాసనం మందుకు విశేష స్పందన లభించింది. మొత్తం 289 మంది చిన్నారులకు మందులను అందించినట్లు అవోపా, వామ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు, భారతసేవా రత్న అవార్డు గ్రహీత వంకదారు శ్రీనాథ్‌గుప్త, రఘు తెలిపారు. ప్రముఖ ఎన్ఆర్ఐ, దాత కాకుబాళ్ నగేష్, త్రిదండి చిన్నజీయర్ స్వామి ఆశీస్సులతో విజయవంతంగా మందును పంపిణీ చేశామన్నారు. వామ్, అవోపా సభ్యులు యాతగిరి వెంకటేశ్వర్లు, ప్రతాప్ ఈరన్నశెట్టి, పర్సాద్‌రావు, రత్నయ్య, మమతశ్రీ, శ్రీదేవి పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



రాంజల చెరువు వద్ద పిచ్చిమొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని రాంజల నల్లచెరువు గట్టు పక్కన ఏపుగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, అధికారులు, కౌన్సిలర్లు, శానిటేషన్ అధికారులు తొలగించారు. శుక్రవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశామని కమిషనర్ తెలిపారు. పట్టణంలో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లోనూ, పార్కులు, ఖాళీ స్థలాల్లోని పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలమని పేర్కొన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

దాడి చేసిన వారిని శిక్షించాలని నిరసన



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

ఆదోని రూరల్: పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళపై దాడి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు కోరారు. శుక్రవారం కేవీపీఎస్, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయా సంఘాల నాయకులు కె.వెంకటమ్మ, అంజి, రామకోటి హనుమంతు, పరమేష్, సురేష్, మారెప్ప, ఆశీర్వాదం, చార్లెస్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు తారాపురంలో ప్రత్యేక పూజలు

పెద్దకడబూరు : చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేయాలని మండలంలోని తారాపురం గ్రామంలో వెలసిన గిడ్డాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయిస్తామని, ఇందుకు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తారాపురం తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఆంజనేయస్వామికి పూజలు చేస్తామని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



డీఎస్పీ కార్యాలయం ఎదుట గోవిందమ్మతో సంఘం నాయకులు

ఎమ్మిగనూరురూరల్: కల్లుకుంట గోవిందమ్మ కేసులో దోషులను కఠినంగా శిక్షించి బాధితురాలికి న్యాయం జరిగేలా చూడాలని బీఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అమరేష్, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ నాయకులు సుమాల చార్లెస్, కదిరికోట బతుకమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఉపేంద్రబాబును బాధితురాలు గోవిందమ్మతో కలసి విన్నవించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో గోవిందమ్మకు పోలీసులు రక్షణ కల్పించాలన్నారు. బీఎస్పీ స్టేట్ కన్వీనర్ మంచాల లక్ష్మీనారాయణ ఉన్నారు.

స్వర్ణాంధ్రలో భాగస్వాములవుదాం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సలీం బాషా

ఎమ్మిగనూరురూరల్: స్వర్ణాంధ్ర – 2047లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి సలీం బాషా కోరారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో అన్నిశాఖల మండల స్థాయి అధికారులు, మండల పరిషత్ కాంప్లెక్స్‌లో వ్యాపార సముదాయం యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్వర్ణాంధ్రకు సంబంధించి ఆయా శాఖల్లో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించిందన్నారు. వ్యాపారులు కూడా తమ సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామని తెలిపారు. హౌసింగ్ డీఈ ప్రసాద్, ఎంపీడీఓ బంగారమ్మ పాల్గొన్నారు.

డిస్కస్ త్రోలో విద్యార్థిని ప్రతిభ



రాధకు సర్టిఫికెట్ అందజేస్తున్న హెచ్ఎం శేఖన్న

పెద్దకడబూరు : గవిగట్టు గ్రామ విద్యార్థినికి డిస్కస్ త్రోలో జిల్లాస్థాయిలో మొదటి స్థానం రావడం ఆనందించదగ్గ విషయమని ప్రధానోపాధ్యాయుడు శేఖన్న అన్నారు. గురువారం కర్నూల్ నగరంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్- 14 విభాగం డిస్కస్ త్రోలో గవిగట్టు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జి.రాధ మొదటి స్థానంలో నిలిచింది. దీంతో శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు రాధ, పీడీ శివకుమార్‌ను అభినందించారు.

గంజాయి స్వాధీనం.. కేసు నమోదు

పెద్దకడబూరు : మండలంలోని హులికన్వీ గ్రామానికి చెందిన మస్కి చిన్న యల్లప్పపై శుక్రవారం గంజాయి అమ్ముతున్నట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. హులికన్వీ గ్రామానికి చెందిన యల్లప్ప గంజాయి ప్యాకెట్లతో గ్రామం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం దగ్గర తిరుగుతున్నాడు. పోలీస్‌లకు అనుమానం వచ్చి తనిఖీ చేయగా ఆయన దగ్గర 651 గ్రాముల పరిమాణం (90 చిన్న ప్యాకెట్లు) గల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఏడుగురిపై కేసు నమోదు

ఆదోని రూరల్: ఆదోని మండలం 104 బసాపురం గ్రామంలో స్థల వివాదంపై ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర శుక్రవారం తెలిపారు. బాధితుడు గోపాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన మారెన్న, ఉప్పర మల్లికార్జున, పరశురాముడు, కొండారెడ్డి, నారాయణ, రాగప్ప, కాళింగలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాబ్‌మేళాలో 33 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కళాశాల ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 33 మంది అభ్యర్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఎంపికైయ్యారు.నవతా రోడ్ ట్రాన్స్‌పోర్ట్, అరబిందో ఫార్మా, వికాస, నవభారత్ ఫర్టిలైజర్స్ కంపెనీలు 33 మందికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాయని ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా తెలిపారు. ఈ మేరకు ఆయా కంపెనీలు నియామక పత్రాలను అభ్యర్థులకు అందించాయి. ఎంపికైన వారిలో 22 మంది తమ కళాశాల విద్యార్థులే ఉన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల నైపుణ్యాభివృద్ధి సంస్థ కో ఆర్డినేటర్ సుధాకర్ ,అశోక్ ,అధ్యాపకులు పాల్గొన్నారు.